రైతుల సాగు కలకు గండ్లు

- పునరుద్ధరణకు నోచుకోని పెనగలూరు చెరువుకట్ట
- గండ్లతో చెరువులో నీరు నిలవక ఇబ్బందులు
- బీడు భూములుగా మారుతున్న పొలాలు
- గండ్లు పూడ్చి నీటిని కేటాయించాలంటూ రైతుల విన్నపం


తెగిపోయిన పెనగలూరు చెరువు కట్ట


పొలాల్లో ఏపుగా పెరిగిన కంపచెట్లు

పెనగలూరు : మండలంలో అత్యంత పెద్దదైన పెనగలూరు చెరువు కట్ట తెగిపోవడంతో మోక్షం ఎప్పుడు వస్తుందోనని రైతులు ఎదురు చూస్తున్నారు. అక్టోబర్ మాసం వచ్చిందంటే రైతులు వర్షం కోసం ఆశగా ఆకాశం వైపు చూస్తుంటారు. వర్షాలు కురిసి చెయ్యేరు నది సాగినా పెనగలూరు కట్ట నిర్మించకపోవడంతో రైతులకు నిరాశ తప్పదు. గతంలో అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడం వల్ల చెయ్యేరు నది కట్ట తెగిపోవడంతో ఆనీరు ఎక్కువ మొత్తంలో పెనగలూరు చెరువుకు వచ్చింది. దీంతో అధిక నీటితో కట్ట తెగిపోయింది. మూడుచోట్ల కట్టకు భారీ గండ్లు పడి 50 అడుగుల మేర గుంత కొట్టింది. దీంతో చెరువులో ఉన్న కాస్త నీరు గుంజన నదిలో కలిసిపోయాయి. అప్పట్లో చెరువుకట్ట అవతల ఉన్న గ్రామాలకు ఇబ్బంది లేకుండా చెరువు గండ్లను పూడ్చి తాత్కాలిక రోడ్డు వేశారు. ఆ తరువాత అడపాదడపా వర్షాలు కురిసిన చెరువులోకి నీరు వచ్చినా గండ్లు కారణంగా నీరు వృథాగా పోయింది. ఈ చెరువుకు చెయ్యేరు నది నుండే నీరు రావాల్సి ఉంది. నది నుండి వచ్చే కాలువను నీటి సంఘం చైర్మన్ సుబ్బరాయుడు పూడిక పనులు చేపట్టారు. ఈ చెరువు కింద 1400 ఎకరాలు పొలం సాగులో ఉంది. ఈ చెరువు ఒకసారి నిండితే రైతులు రెండు పంటలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పండించుకోవచ్చు. రైతుల ఆర్థిక అభివృద్ధికి పెనగలూరు చెరువు ఎంతో దోహదం చేసింది. మూడేళ్లుగా చెరువు నిండకపోవడంతో చెరువు కింద ఉన్న పొలాల్లో కంపచెట్లు ఏపుగా పెరిగాయి. ప్రతి ఏడాది కంపచెట్లు పెరుగుతుండటం వల్ల ఖర్చు వస్తోందని, భారం భరించలేక రైతులు పొలాల్లో ఉన్న కంపచెట్లను అలానే వదిలేశారు. ఈ చెరువు కింద పొలాలు ఉన్న గ్రామాలను పరిశీలిస్తే పెనగలూరు నాగిరెడ్డిపల్లి, కొత్తపల్లి, కోడి చెన్నయ్యగారిపల్లి, ఎస్ఆర్ పురంతోపాటు గుంజన నది అవతల ఉన్న గ్రామాలు సిరివరం, తిరణంపల్లి, రెడ్డివారిపల్లి, కొండూరు గ్రామాలకు చెందిన రైతులతోపాటు కౌలు రైతులు కూడా పొలాలను సాగు చేస్తుంటారు. అలాంటి కౌలు రైతులు కూడా చెరువు నిండకపోవడంతో కూలీలకు వెళ్తున్నారు. చెరువు నిండకపోవడంతో రైతులకు, కూలీలకు చేతినిండా పనులు లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు, పాలకులు ఈ చెరువుపై ప్రత్యేక దృష్టి సారించి తెగిన చెరువు కట్టను పూర్తి చేసేందుకు కృషి చెరువుకు నీటిని విడుదల చేసి పెనగలూరు రైతాంగాన్ని ఆదుకోవాలంటూ అధికారులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

చెరువు నిండితే రెండు పంటలు



మండలంలో పెద్దదైన పెనగలూరు చెరువు ఒకసారి నిండితే పంటలు పండుతాయి. దీంతో రైతులు, కూలీలకు చేతినిండా పనులు దొరుకుతాయి. ప్రభుత్వం వెంటనే కట్ట పనులకు నిధులు కేటాయించి పునరుద్ధరణ పనులు చేయించాలి. చెరువు ఆయకట్టుకు నీటిని కేటాయించి రైతాంగానికి భరోసా ఇవ్వాలి.

– కోదూరు మురళీ, రైతు, పెనగలూరు

కట్టను వెంటనే నిర్మించాలి



పెనగలూరు చెరువుపై ఆధారపడి జీవించే రైతుల సంఖ్య చాలా అధికం. మూడేళ్లుగా చెరువు నిండటం లేదు. వచ్చిన కాసింత నీరు కూడా గండ్లు కారణంగా వృథాగా పోతోంది. తెగిన కట్టను పూర్తి చేస్తే మండలంలో వ్యవసాయంపై ఆధారపడిన రైతులకు మేలు చేసిన వారవుతారు. ప్రభుత్వం కట్టను నిర్మించడమే కాక పెనగలూరు చెరువుకు నీటి కేటాయింపులు చేయాలి.

– కాలి కొండయ్య, రైతు, పెనగలూరు

భూగర్భ జలాలు పెరుగుతాయి



చెరువులో నీరులేక వందలాది రైతులు సాగుకు దూరంగా ఉన్నారు. చెరువులో నీరు ఉంటే భూగర్భ జలాలు పెరిగి మోటార్లకు నీరు పుష్కలంగా ఉంటాయి. వ్యవసాయం లాభసాటి చేయడంతోపాటు వ్యర్థంగా ఉన్న భూములను సాగులోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. చెరువుకట్ట పూర్తి చేసినట్లెతై రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– అబ్బినేని సుబ్బరాయుడు, నీటి సంఘం చైర్మన్

పొలాలు బీడులుగా మారాయి



చెరువు కట్ట తెగిపోవడంతో చెరువులోకి నీరు రాక చెరువు కింద సాగులో ఉన్న పొలాలు బీడు భూములుగా మారాయి. వెంటనే చెరువుకట్ట పనులు చేపట్టి రైతులకు మేలు చేయాలి. సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్న పంటకు నీరు అందించలేక బాగా ఇబ్బంది పడ్డాను. దీంతో భూమిని కూడా అలానే వదిలేశాను. అధికారులు కట్ట నిర్మించి నీరు చెరువులోకి చేరే విధంగా చేస్తే రైతులకు మేలు చేసిన వారవుతారు.

– శ్రీనివాసులు, రెడ్డి, రైతు, నాగిరెడ్డిపల్లి

బలవంతపు భూ రిజిస్ట్రేషన్‌లపై చర్యలు తీసుకోండి

రాయచోటి అర్బన్ : ఎస్సీ కార్పొరేషన్‌కు విక్రయించిన భూమిని తిరిగి బలవంతంగా లాక్కొంటున్న సి.రవీంద్రనాథరెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు టి.ఎల్.వెంకటేష్, వంగిమళ్ల రంగారెడ్డిలు దళితులతో కలసి విన్నవించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వారు కలెక్టర్‌ను కలుసుకుని మాట్లాడారు. కేవీపల్లె మండలం తిమ్మాపురం గ్రామంలోని ఎస్సీ కార్పొరేషన్ అధికారులు భూమి కొనుగోలు పథకం కింద 2006లో రవీంద్రనాథరెడ్డి వద్ద 43 ఎకరాల భూమిని కొనుగోలు చేశారన్నారు. సదరు భూమిని 52 మంది దళితులకు పంపిణీ చేశారన్నారు. కొందరు భూములను సాగుచేసుకుంటుండగా, మరి కొందరు సాగు చేసుకోవడం లేదన్నారు. కాగా రవీంద్రనాథ్‌రెడ్డి గతంలో తాను ఎస్సీ కార్పొరేషన్‌కు విక్రయించిన భూమిని ఆక్రమించుకుంటూ, బలవంతంగా సంతకాలు చేయించుకుని రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారంటూ ఆరోపించారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి బాధ్యుడుపై చర్యలు తీసుకోవాలంటూ విన్నవించారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రాన్ని సమర్పించారు. కలెక్టర్ స్పందిస్తూ సమస్యపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామంటూ వారికి హామీయిచ్చారు. కార్యక్రమంలో దళితులు చిన్న, వెంకటరమణ, యువరాజు, రామసుబ్బమ్మ, ఈశ్వరమ్మ, రెడ్డెమ్మ, వెంకటరమణ, రెడ్డిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం

సంబేపల్లె : మండల పరిధిలోని ఎస్.సోమవరం గ్రామం దేవళంపేటకు చెందిన వైఎస్ఆర్‌సీపీ నాయకుడు అమీర్‌బాషా మృతి చెందడం పార్టీకి తీరనిలోటని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. అమీర్‌బాషా గుండెపోటుతో ఇటీవల మృతి చెందాడు. సోమవారం దేవళంపేటకు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, చిదబరంరెడ్డి, మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రవీంద్రనాయుడు, మాజీ సర్పంచ్ పాలవెంకటరమణలతో కలిసి అమీర్‌బాషా కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. మృతికి గల కారణాలపై ఆరాతీశారు. అమీర్‌బాషా వైఎస్ఆర్‌సీపీకి చేసిన సేవలను నెమరువేసుకున్నారు. అదే విధంగా గ్రామంలోని తీవ్రంగా గాయపడి విశ్రాంతి తీసుకొంటున్న సయ్యద్‌సాబ్, ఎగువ సోమవరంలో గుండెపోటుతో మృతి చెందిన నారాచంద్రయ్యనాయుడు అంత్యక్రియల్లో పాల్గొని నివాళి అర్పించారు. బావులకాడపల్లెకు చెందిన తిరుపతి రెడ్డిబాబు కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో జేసీఎస్ మండల కన్వీనర్ వడ్డి వెంకటరమణారెడ్డి, నాయకులు వాసుదేవరెడ్డి, మల్లికార్జునరెడ్డి, పెద్దయ్య, అహమ్మద్‌బాషా, సయ్యద్‌బాషా, రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.


సంబేపల్లె: అమీర్‌బాషా కుటుంబాన్ని పరామర్శిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు

పరామర్శ

రామాపురం : మండలంలోని కుమ్మరపల్లె గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను సోమవారం మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. సూరకవాండ్లపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకుడు అమరనాథరెడ్డిని, మోకాలికి శస్త్రచికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న రఘునాథరెడ్డిని, దూదేకులపల్లెలో పెరాలసిస్ సోకి వైద్యం పొంది విశ్రాంతి తీసుకుంటున్న సుంకేసుల సిద్దయ్య, బసిరెడ్డిగారిపల్లెలో అనారోగ్యంతో బాధపడుతున్న వేంపల్లె హుసేన్‌బాషాలను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటానని తెలియజేశారు. ఆయనతోపాటు మాజీ సర్పంచ్ రామ్‌బసిరెడ్డి, మాజీ డీలర్లు జయరామిరెడ్డి, రాజారెడ్డి, పీరయ్య, సహదేవరెడ్డి, రామచంద్రరెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బకాయిల చెల్లింపులో ఆలస్యం తగదు

రాజంపేట టౌన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన వివిధ రకాల ఆర్థిక బకాయిలను చెల్లించడంలో కూటమి ప్రభుత్వం ఆలస్యం చేయడం తగదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బిల్లా హరిప్రసాద్ తెలిపారు. స్థానిక జెడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన యూటీఎఫ్ మండల స్వర్ణోత్సవ మహాసభలో హరిప్రసాద్ పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైనా ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. ప్రపంచ బ్యాంకుతో ఒప్పందం కుదుర్చుకున్న సాల్ట్ పథకాన్ని రద్దు చేయాలని, విద్యారంగంలో ప్రపంచ బ్యాంక్ విధానాలను అమలు చేయడాన్ని స్వస్తి పలకాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులకు, అనవసరమైన ఆన్‌లైన్ పనుల భారం పెట్టకుండా మినహాయింపు ఇచ్చి పూర్తిగా బోధనలకే పరిమితమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల మనుగడకు ప్రశ్నార్థకంగా మారిన జీఓ 117ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల నిర్వహణకు పూర్తిస్థాయిలో గ్రాంట్లు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు డి.చెంగల్‌రాజు, పి.వెంకటసుబ్బయ్య, సీవీ.రమణమూర్తి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హరిప్రసాద్

ఉపాధ్యాయుల పొదుపు డబ్బులు చెల్లించాలి

రాయచోటి టౌన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులు తాము దాచుకన్న పొదుపు డబ్బులు వెంటనే చెల్లించాలని రాష్ట్ర రవాణా, క్రీడల, యువజన శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డికి ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లెక్కల జమాల్‌రెడ్డి, మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి సోమవారం వినతి పత్రాన్ని సమర్పించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు తాము నెలనెలా పొదుపు చేసుకున్న ప్రావిడెంట్ ఫండ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్ డబ్బులు వెంటనే చెల్లించాలని కోరారు. ఇప్పటి వరకు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం 20 వేల కోట్లు అప్పు బకాయిలు ఉన్నాయని తెలిపారు. వాటి చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ఆయన ఈ విషయాన్ని మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. అంతకు ముందుగా ఎన్‌జీఓ హోంలో సంఘం సభ్యులతో కలసి చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పీసీ రెడ్డెన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయ రెడ్డి, పురుషోత్తమ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ మజహరుల్ హక్, రాష్ట్ర కార్యదర్శి మునిరెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు జక్రియా బాషా, ఓబుల్ రెడ్డి, రాయచోటి సంఘం నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ పి.సుబ్బారెడ్డి

దళిత రైతులకు న్యాయం చేయండి

ఓబులవారిపల్లె : ఇటీవల అగ్రవర్ణాల దాడిలో గాయపడ్డ పెరుమాళ్లపల్లి దళితవాడ రైతులకు న్యాయం చేయాలని బీకేఎంయూ నాయకులు రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియా దేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దఓరంపాడు రెవెన్యూ పరిధిలో పెరుమాళ్లపల్లె దళితవాడకు చెందిన రైతులు సంవత్సరాలుగా భూమిని చదును చేసి వర్షాకాలం పంటలు పండించుకుంటున్నారన్నారు. ఇటీవల అగ్రవర్ణాలకు చెందిన వారు అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అగ్రవర్ణాల వారు సంబంధిత భూమిలో కబ్జాలకు పాల్పడ్డారని అడ్డువెళ్లిన దళిత రైతులను కొట్టి చంపడానికి బరితెగించారని, కూటమి నాయకుల భూ కబ్జాలకు అడ్డూ అదుపులేకుండా పోయిందని ఆరోపించారు. దాడులు జరిగి పదిరోజులు అయినా ఇప్పటి వరకు వారిపై చర్యలు తీసుకోలేదని తెలిపారు. వెంటనే చర్యలు తీసుకొని ఆ భూములను పెరుమాళ్లపల్లె దళితవాడ గ్రామస్తులకు ఒకటిన్నర ఎకరా చొప్పున పంపిణీ చేయాలని లేనిపక్షంలో బీకేఎంయూ ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు బీకేఎంయూ నాయకులు జయరామయ్య, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పండుగోల మణి, రాజంపేట నియోజకవర్గ కార్యదర్శి గుడిసె నరసింహులు, కోడూరు అధ్యక్షులు రవి, కార్యదర్శి ఎం రమణయ్య, రేపూరి కృష్ణయ్య, పెరుమాళ్లపల్లి దళితవాడ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి

రాజంపేట టౌన్ : జీఓ నంబర్ 77ను రద్దు చేసి పీజీ చదివే అర్హులైన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్న డిమాండ్‌తో సోమవారం ఎస్ఎఫ్ఐ నాయకులు స్థానిక సబ్‌కలెక్టరేట్ కార్యలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కావస్తున్నా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయలేదని దుయ్యబట్టారు. విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే నవంబర్ 6వ తేదీ కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం సబ్‌కలెక్టర్ వైకోమ్ నిదియాదేవికి ఎస్ఎఫ్ఐ నాయకులు వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, సూర్యవర్ధన్, శ్రావణ్, ఫాహిద్ పాల్గొన్నారు.

వంక ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

రాయచోటి: ప్రకృతి సిద్ధంగా వెలసి పదిమందికి ఉపయోగపడుతూ పశువుల దప్పికను తీర్చే ఊటవంకను ఆక్రమణదారులు నుంచి కాపాడాలని వాల్మీకిపురం గ్రామస్తులు కోరుతున్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పరిష్కార వేదికలో వాల్మీకిపురం గ్రామం పత్తెపురం రైతులు కలెక్టర్‌ను కలిసి వంక ఆక్రమణ సమస్యను తెలియజేశారు. గ్రామంలోని సర్వే నెంబర్. 982లో 4.44 ఎకరాల వంక భూమిని కొందరు ఆక్రమించడంతో సమీప పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ భూమిలో పశువులను మేపుకోవడానికి, ఊటనీటిని తాపుకోవడానికి వీలు లేకుండా పోయిందన్నారు. రాజకీయ పలుకుబడితో సమీప ప్రాంతాల్లో ఉన్న రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారంగా కొలతలు వేయించి పట్టా భూములలో వంక ఉన్నట్టు చూపించి ప్రవాహంలో ఉన్న వంకను పూడ్చి వేస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు. సత్వరం స్పందించి వంక భూమిని కాపాడాలని గ్రామ రైతులు కలెక్టర్‌కు విన్నవించుకున్నారు.

ఇసుక రీచ్‌ను అంగీకరించబోం

గ్రామసభలో అధికారులకు తేల్చిచెప్పిన మట్లి గ్రామస్తులు

వీరబల్లి : మండల పరిధి మట్లి సమీపంలోని మాండవ్య నదిలో ప్రభుత్వం ఇసుక రీచ్ ఇస్తే నదీ పరివాహక ప్రాంత రైతులకు తీవ్ర నీటి ఎద్దడితో బోరు బావుల్లో నీటి మట్టం తగ్గిపోయి పంటపొలాలు సాగు చేసుకోవడానికి అవకాశం ఉండదని మట్లి గ్రామ ప్రజలు, నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు గ్రామ సభలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సోమవారం మట్లి సమీపంలోని రామాలయం వద్ద సర్పంచ్ నాగార్జునాచారి, తాటికుంటపల్లి సర్పంచ్ గోపినాథ్‌రెడ్డి అధ్యక్షతన తహసీల్దార్ శ్రావణి, ఎంపీడీఓ నూర్జహాన్‌లు గ్రామ సభ నిర్వహించారు. ప్రజలకు అధికారులు ఇసుక రీచ్ వల్ల అనుకున్నంత ఇబ్బంది ఉండదని నచ్చచెప్పడానికి ప్రయత్నించగా ప్రజలు తిరస్కరించారు. ఎట్టి పరిస్థితుల్లో ఇక్కడ ఇసుక రీచ్‌కు ఒప్పుకోమని రైతులు, గ్రామస్తులు ముక్త కంఠంగా అధికారులకు తెలియజేశారు. ప్రస్తుతం అరకొర కురిసిన వర్షాలతో పంటపొలాలను సాగు చేసుకుంటున్నామని, ఇలాంటి సమయంలో ప్రభుత్వం ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేస్తే భూగర్భ జలాలు అడుగంటి బోరుబావులు ఎండిపోతాయని, అప్పుడు పంటలు లేక ఆత్మహత్య చేసుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితి వస్తుందని అధికారుల ఎదుట వాపోయారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్‌లు ఈ విషయంపై సుదీర్ఘంగా ఆలోచించాలని సర్పంచ్ నాగార్జునాచారి, ప్రజలు కోరారు.

ఐడీ కార్డులు అందజేత

ఓబులవారిపల్లె : బీపీ రాచపల్లి ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తన సొంత నిధులతో ఉపాధ్యాయుడు బి.రాజా నాయక్ సమకూర్చారు. సోమవారం విద్యార్థులకు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజా నాయక్ మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న 110 మంది విద్యార్థులకు రూ. 7500లతో ఐడెంటిటీ కార్డులు అందజేసినట్టు తెలిపారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.చెంగమ్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆక్రమణల తొలగింపు

ఓబులవారిపల్లె : పాపిరెడ్డిపల్లెహరిజనవాడ ప్రాథమిక పాఠశాల ప్రహరీ కబ్జాపై సోమవారం జిల్లా విద్యాధికారి శివప్రకాశ్రెడ్డి, రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియా దేవి పరిశీలించారు. స్థలం కబ్జాపై గ్రామస్తులు ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేయగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు పరిశీలించారు. రికార్డులు పరిశీలించి పాఠశాల ప్రాంగణంలో దాదాపు ఐదు సెంట్ల మేర స్థలం కబ్జా అయినట్లు గుర్తించి తొలగించారు. కార్యక్రమంలో ఎంఈఓ రెడ్డయ్య, డీటీ రెడ్డి ప్రసాద్, ఆర్ఐ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైట్లు ఏర్పాటు

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని వైకోట గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్ మల్లెం ఈశ్వరయ్య సహకారంతో కో–ఆప్షన్ మెంబర్ షేక్ మౌలానా విద్యుత్ లైట్లను సోమవారం ఏర్పాటు చేశారు. ముస్లిం కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. లైట్లు ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నా కుమార్తెపై దాడి చేసిన వారిని శిక్షించండి

రాయచోటి టౌన్ : నా కుమార్తెపై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని గాలివీడు మండలం నూలివీడు గ్రామం ఆవులవాండ్లపల్లెకు చెందిన దేరంగుల చిన్నప్ప జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడుకు సోమవారం గ్రీవెన్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తన కుమార్తె సుజాత (మతి స్థిమితం లేని) ఈ నెల 22వ తేదీ ఇంటిలో ఉండగా పక్కింటి ప్రమీల, రాధాకృష్ణలకు చెందిన కోళ్లు ఇంటిలోకి వచ్చాయి. వాటిని బయటకు తరిమేయడంతో ఆగ్రహించిన వారిద్దరు మతి స్థిమితం లేని నా కుమార్తెను చితకబాదారని ఆరోపించారు. దీనిపై గాలివీడు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా వారు స్పందించలేదన్నారు. మీరు దీనిపై సమగ్ర విచారణ జరిపించి వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.

పింఛా కాలువల్లో పూడికతీత

సుండుపల్లె : మండల పరిధిలోని పింఛా ప్రాజక్టు కుడి, ఎడమ కాలువలో నీటి పారుదలకు ఇబ్బందిగా ఉండటంతో జలవనరుల శాఖ ఈఈ వెంకటరామయ్య సోమవారం జేసీబీ సహాయంతో పూడికలు, కంచపెట్లను తీయించారు. గత వారంలో కురిసిన తుపాను కారణంగా రైతులు వ్యవసాయానికి పింఛా కుడి కాలువకు 40 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాలువకు 30 క్యూసెక్కుల నీటిని రెండురోజుల క్రితం ఎస్ఈ శ్రీనివాసులు విడుదల చేశారు. కాలువలలో నీరు సక్రమంగా ప్రవహించకపోవడంతో కాలువ పూడికలను, కంపచెట్లను తొలగించారు. ఈ కార్యక్రమంలో డీఈ చెంగల్‌రాయుడు, ఏఈ నాగేంద్ర నాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ లేని చదువు వ్యర్థం

వీరబల్లి : క్రమశిక్షణ లేని చదువు వ్యర్థమని ఎస్ఐ మోహన్ నాయక్ తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న ఎస్‌డీకేఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏమి చదువుతున్నామన్నది ముఖ్యం కాదని, ఎలా చదువుతున్నామన్నదే ముఖ్యమన్నారు. యువతీయువకులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. దురలవాట్లకు బానిస కాకుండా క్రమ శిక్షణతో చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. అనంతరం ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎస్ఐ, బ్యాంక్ మేనేజర్‌లను కళాశాల డైరెక్టర్ రవి శంకర్ రెడ్డి శాలువలతో సన్మానించారు.

సమస్యల పరిష్కారానికి గ్రామసభ

సిద్దవటం : రైతుల భూముల రీసర్వే సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలను నిర్వహిస్తున్నామని తహసీల్దారు మురాషావలి తెలిపారు. సిద్దవటం మండలంలోని ఎస్.రాజంపేట గ్రామంలో సోమవారం గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ రైతులు భూముల రీసర్వే పై పరిష్కారానికి గ్రామ సభలు జరుతున్నాయన్నారు. కొంతమంది రైతులు మిట్ట ప్రాంతాల్లో ఉన్న భూములకు వెళ్లేందుకు రహదారి కావాలని గ్రామ సభలో అర్జీలను సమర్పించారన్నారు. కార్యక్రమంలో వీఆర్ఓ ప్రభాకర్‌రెడ్డి, సర్వేయర్‌లు ఖాజామొహిద్దీన్, పురుషోత్తంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు రమణ, సంజీవరాయుడు, ప్రజలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

రాజంపేట : మున్సిపల్ కార్యాలయం ఎదుట తమ డిమాండ్ల పరిష్కారానికి సోమవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ నేత చిట్వేలి రవికుమార్ మాట్లాడుతూ పట్టణాల విస్తరణ మేరకు కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ లోపాలను సరిదిద్దాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పీవీ రమణ, కార్మిక నాయకులు ఎంవీ రమణ, గంగయ్య, రత్నాలు, సురేష్, ఎం.రెడ్డి, నానమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా వేదిక

ఒంటిమిట్ట : మండలంలోని 13 పంచాయతీలలో చేసిన ఉపాధి హామీ పనులపై ఈనెల 17వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరిగిన సామాజిక తనిఖీపై నేడు మంగళవారం ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సోమశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన

రాజంపేట : అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై నేటి సమాజానికి ఎంతైనా అవగాహన అవసరమని ప్రిన్సిపల్ డా.స్వర్ణలత అన్నారు. సోమవారం ఎన్ఎస్ఎస్ వింగ్ ఆధ్వర్యంలో ఫార్మాడీ విద్యార్థులు ఎర్రబల్లి గ్రామంలో ఇంటింటికి వెళ్లి బ్రెస్ట్ క్యాన్సర్ రావడానికి గల కారణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ మహిళలు చురుకుగా ఆరోగ్యంగా పనిచేస్తున్నప్పుడు క్యాన్సర్ లాంటి జబ్బులు రావన్నారు. వంశపారపర్యంగా ఉన్న ఈ క్యాన్సర్ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. 40 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళ మామోగ్రఫీ టెస్ట్ నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల అధ్యాపక బృందం ప్రదీప్, శ్రావణ్, లీలామణి, మణిదీప్, విద్యార్థి బృందం పాల్గొన్నారు.

చెకుముకి పరీక్షలో సత్తా

నందలూరు : జేవీవీ ఆధ్వర్యంలో రాయచోటి డైట్ కాలేజీ సభా భవన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలో ప్రైవేటు స్కూల్ విభాగంలో నందలూరు మండలానికి చెందిన సెయింట్ జోసెఫ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి సత్తాచాటారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ భూమన శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు హుమేరా తస్నీం, పేరీందేవి, రితేష్ కుమార్‌లు జిల్లాస్థాయిలో నందలూరు మండలానికి వన్నె తెచ్చారని కొనియాడారు.

వీఆర్ఓలు అందుబాటులో ఉండాలి

పుల్లంపేట : వీఆర్ఓలు ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ అరవింద కిషోర్ కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా వీఆర్ఓలు, సర్వేయర్‌లతో ఆయన సమావేశమయ్యారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వీఆర్ఓలు గ్రామాలలో పర్యటించి రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలన్నారు. అలాగే ఆన్‌లైన్ సమస్యలు పెండింగ్ లేకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు.

ఆర్ఎస్‌యూ మహాసభలను జయప్రదం చేయండి

రాయచోటి అర్బన్ : నవంబరు 29, 30 తేదీలలో రాజంపేట పట్టణంలో నిర్వహించే ఆర్ఎస్‌యూ 3వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆర్ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ప్రతిభా జూనియర్ కళాశాల అధినేత శివగంగిరెడ్డి చేతుల మీదుగా మహాసభల పోస్టర్లను విడుదల చేయించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర, కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

రైల్వేకోడూరు అర్బన్ : ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సర్వేపల్లి నరసింహా మాట్లాడుతూ ఇంటర్మీడియట్, డిగ్రీ తదితర విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీఎంబర్స్‌మెంట్ రూ. 3480 కోట్లు చెల్లించాలని తెలిపారు. ఇలాగే కొనసాగితే ఉద్యమాలు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ప్యాసింజర్ రైలు నడపాలి

చిట్వేలి : ఓబులవారిపల్లె – కృష్ణపట్నం రైలు మార్గంలో ప్యాసింజర్ రైలు నడపాలని, ఇది ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక అని రాష్ట్ర రైతు సంఘం నాయకులు మలిశెట్టి రాహుల్ విజ్ఞప్తి చేశారు. సోమవారం వెంకట్రాజుపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ రైలు మార్గం ప్రారంభమైన పది సంవత్సరాల నుంచి గూడ్స్ రైలు నడుస్తుందే తప్పా ఇంతవరకు ప్యాసింజర్ రైలు నడపకపోవడం అన్యాయమన్నారు. ఈ మార్గంలో ప్యాసింజర్ నడిపితే నెల్లూరు – విజయవాడలలో చదువుకునే విద్యార్థులకు, రాజధాని అమరావతికి వెళ్లే ప్రయాణికులకు చాలా సౌకర్యంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. అలాగే గాలేరు – నగిరిని త్వరగా పూర్తి చేసి రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలలోని చెరువులను నింపలాని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య, ఈశ్వరయ్య, శివారెడ్డి, వెంకటమణి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.